క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మైనోద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 08494 224315 నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

ఉద్యాన శాఖ కమిషనర్‌కు ఘన స్వాగతం


ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమణారెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ కమిషనర్ శ్రీధర్‌ను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టు రైతులకు ఇన్సెంటివ్ అందించాలన్నారు. మామిడి తోటల రైతులకు ఇన్సూరెన్స్ వచ్చేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, వీహెచ్ఏ వేమారెడ్డి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రబోధ కమిటీ సభ్యులు

కదిరి టౌన్: పట్టణంలో మంగళవారం త్రైత సిద్ధాంతంపై ప్రచారం నిర్వహించారు. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి టవర్‌క్లాక్ వరకూ త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకుంటే ధర్మస్థాపన జరుగుందని తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షులు కె.లక్ష్మీనారాయణ ఆచారి, సభ్యులు నాగేంద్ర, బాలమ్మ, రాజేశ్వరి, అరుణ, గంగాదేవి, వెంకటలక్ష్మి, జయలక్ష్మి, ప్రమీల, ఈశ్వరమ్మ, చిట్టి, హారిక తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుట్టపర్తి: షూటింగ్ బాల్ పోటీల్లో బుక్కపట్నం బాలుర పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన చరణ్‌కుమార్, సాయితేజ, గణేష్, ఆకాష్‌రెడ్డి, గిరీష్, రామ్‌చరణ్‌లు అండర్ -17,అండర్ -19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జగదీష్, పీడీ నాగరాజ్ తెలిపారు. ఎంపికపై పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నివాళి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: ముదిగుబ్బకు చెందిన బండల శివారెడ్డి కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓబిరెడ్డి మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటరకృష్ణారెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతునికి భార్య సరళ, కుమార్తె ఉన్నారు. కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి కృష్ణారెడ్డి, చంద్రాయుడు తదితరులు వున్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు


మారెమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కొరెడ్డిపల్లితండాలో మంగళవారం జరిగిన మారెమ్మ జాతరలో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరిపైనా అమ్మవారి చల్లని దీవెనలు ఉండాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేలా దీవించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


'పతాకా'న ఆనందం : సభకు వైఎస్సార్ సీపీ జెండాలతో వస్తున్న శ్రేణులు


సంక్షేమ రా'రాజు'ను చూడాలని : సీఎం రాక కోసం ఎదురుచూస్తున్న మహిళలు


ఆటో.. అటే : ఆటోలో వెళ్తూ జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న అభిమానులు


వెయ్ చిందెయ్..నృత్యం చేస్తున్న మహిళలు

ఉత్సాహం.. ఉరకలు

- సీఎం జగన్ రాకతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్

ప్రశాంతి నిలయం/పుట్టపర్తి రూరల్: అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. పార్టీ అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి రాకతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ కన్పించింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సమరోత్సాహంతో కార్యకర్తలు తరలివచ్చారు. జనసందోహాన్ని పరిశీలిస్తే 2019 ఎన్నికల ఫలితాలకు మించి ఈసారి మెజారిటీ వస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కిక్కిరిసిన రోడ్లు

'వైఎస్సార్ రైతు భరోసా' ఐదో ఏడాది రెండో విడత నిధుల విడుదల కోసం పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. జననేత రాకతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. సూపర్ ఆస్పత్రి కూడలిలో వేల సంఖ్యలో ప్రజలు రోడ్లపై నుంచి సభను తిలకించారు.

కళ్లారా చూసి.. ఆనందించి..

అభిమాన నాయకున్ని చూసిన కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. అడుగడుగునా స్వాగతం పలుకుతూ, కేకలు వేస్తూ.. జయ జయ ధ్వానాలతో ఉప్పొంగిన ఉత్సాహం అందరిలో ఉరకలేసింది. ఇరువైపులా అశేష జనవాహిని బారులు తీరి కాన్వాయ్‌పై పూల వర్షం కురిపించారు. జనం చూపిన అంతులేని అభిమానానికి మంత్రముగ్ధుడై మిక్కిలి సంతోషించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులు జోడించి ప్రతి ఒక్కరికీ నమస్కరించారు.పుట్టపర్తిలోని విమానాశ్రయం నుంచి బహిరంగ సభ వేదిక వరకూ జనం బారులుతీరారు.


జనపర్తి : జనంతో కిక్కిరిసిన పుట్టపర్తిలోని రహదారి


జగన్నినాదమే..: సభ ముగిశాక ఉత్సాహంగా వెళ్తూ..

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్' ఐదో ఏడాది రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం విజయవంతం చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఊహించిన దాని కంటే ఎక్కువ మంది తరలివచ్చి అభిమానం చాటుకున్నారు. జన సమీకరణలో తోడ్పాటు అందించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు రుణపడి ఉంటా. జననేత రాకతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ నిండుకుంది. ఉత్సాహం రెట్టింపు అయింది. సమరోత్సాహం కళ్లలో కనిపించింది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధమంటున్నట్లు స్పష్టమైంది.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

సీఎం జగన్‌కు 'కోటి' స్వాగతం



బత్తలపల్లి: పుట్టపర్తిలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు కలిశారు. వేదికపై సీఎంతో కరచాలనం చేశారు. ఆలింగనం చేసుకున్నారు.

గ్రంథాలయాల్ని వినియోగించుకోండి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని జగజ్జీవన్‌రాం నగర్‌లో ఉన్న గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ఎల్ఎం ఉమ, మాజీ అధ్యక్షులు ఎల్ఎం మోహన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బ్యానర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉండే పుస్తకాల పఠనంతో నిరుద్యోగులు మంచి ఉద్యోగాలు సాధించవచ్చని సూచించారు. ప్రతిరోజు పుస్తక పఠనం వల్ల మేథాశక్తి పెరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణనాయక్, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.


బ్యానర్ ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి

ఇష్టంతో అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ధర్మవరం: ఇష్టంతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎల్పీ సర్కిల్‌లో ఉన్న శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్తు కోసం ముందుగానే బాటలు వేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువులో రాణిస్తూ ఉన్నత ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, కరస్పాండెంట్ జగదీష్, అధ్యాపకులు రమేష్, శ్రీరాములు, రామాంజినేయులు, శ్రీనివాసులు, వాణి, కావ్యశ్రీ, నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

- డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తిలో మంగళవారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహాసభకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఇచ్చిన హామీలను అన్నిటినీ నెరవేర్చిన ఘనత జగన్‌ది అన్నారు. రైతులకు ఏడాదికి రూ.13,500 ఇవ్వడం ప్రశంశనీయమన్నారు. ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు పొరాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ధర్మవరం అర్బన్: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బీసీఆర్ దాస్ కోరారు. ఈ విషయంపై మందకృష్ణ మాదిగ తలపెట్టిన విశ్వరూప మహాసభ విజయవంతం కోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రచార రథయాత్ర కొనసాగిస్తూ మంగళవారం ధర్మవరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పించి విశ్వరూప మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బీసీఆర్ దాస్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా చూడాలని కోరారు. ఈనెల 11న హైదరాబాద్‌లో విశ్వరూప మహాసభను నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతిఒక్కరూ హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు నాగరాజు, మండల కన్వీనర్ శేషు, ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ కోళ్ల కళ్యాణ్, జిల్లా ఉపాధ్యక్షుడు బూదెప్ప, నాయకులు తాడిమర్రి రామంజి, గజ్జల రామంజి, పూజారి పెద్దన్న, రామకృష్ణ, పద్మావతి, శివమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీఆర్ దాస్, నాయకులు

ఆకట్టుకున్న సంగీత విభావరి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. నాలుగో రోజు మంగళవారం రాత్రి కుటాగుళ్లకు చెందిన స్వామి భజన బృందం నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ,ఈఓ వి.శ్రీనివాస రెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ


హాజరు పట్టిక పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామానాయక్

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి, గొడ్డువెలగల గ్రామ సచివాలయాలు, గొడ్డువెలగలలో అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ రామానాయక్ మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల వివరాలను కార్యదర్శి బాషాను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్య తెలుసుకుని సత్వరం పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గొడ్డువెలగలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఎంత మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఉన్నారంటూ తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అర్హులైన వారికి అందించాలని సిబ్బందికి సూచించారు.

ప్రజారోగ్యమే సీఎం జగన్ సంకల్పం


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం అర్బన్: ప్రజలందరి ఆరోగ్యం కోసమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని జగజ్జీవన్‌రాంనగర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరి ఆరోగ్యం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఇంటిలోని వారందరికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, ముగ్గురికి అద్దాలు ఉచితంగా అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గజ్జల శివ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కకాటు బాధితుడికి ఖరీదైన వైద్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పేదలకు ఖరీదైన, నాణ్యమైన వైద్యం అందుతోంది. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన హరి కుమారుడు లక్కీ అనే చిన్నారిపై ఈ నెల2న కుక్క దాడి చేసింది. ఈ క్రమంలో చిన్నారి కుడి చెంప, కంటి పై భాగంలో తీవ్ర గాయమైంది. చెన్నేకొత్తపల్లి సీహెచ్‌సీ నుంచి వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఈనెల 3న అనంతపురం సర్వజనాస్పత్రికి పంపారు. ఆస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలోని వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. రేబిస్ ఇమినోగ్లోబిలిన్ తదితర మందులు అందించి, మెరుగైన వైద్యం అందించారు. లక్కీ కోలుకోవడంతో యూనిట్ – 2కు మార్చి, మంగళవారం డిశ్చార్జ్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇలాంటి వైద్య చికిత్సలు పొందాలంటే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. అలాంటిది ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉచితంగా ఖరీదైన వైద్యం అందింది.

వ్యక్తి ఆత్మహత్య

శింగనమల: పోతురాజుకాల్వ సమీపంలో అనంతపురం–తాడిపత్రి హైవేపై కూతలేరు బ్రిడ్జి వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ చితంబరం తెలిపిన వివరాలు.. అనంతపురం సాయినగర్‌కు చెందిన మనోహర్(39) కారు డ్రైవరుగా పని చేసేవాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. గతంలో రెండు ఆటోలు పెట్టి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈక్రమంలో కూతలేరు బ్రిడ్జి దూలానికి ఉరేసుకున్నాడు. మనిషి బరువుకు తాడు తెగి కంపచెట్లలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.